


-'సార్ధోనికస్'

కొందరు సన్యాసుల్లో ఎందుకు కలిసి పోతారో ఆశ్చర్యం కలిగించింది భుజంగానికి. తలిదండ్రులతో పోట్లాడో, సంసారం నడిపించ గలకనో, 'నీ వెందుకూ పనికిరావు, సన్యాసుల్లో కలవరాదూ' అని ఎవరైనా విసుక్కున్నందువల్లనో, 'సన్యాసి సుఖి, సంసారి దుఃఖి' అని ఏనాటి కథ లోనో, [illegible] విన్నందు వల్లనో, [illegible] భరించలేక, [illegible] తప్పుకోలేక, 'ఫ్యామిలీ ప్లానింగ్ కన్నా సన్యాసుల్లో కలవటమే ఉత్తమ'మని తోచి నందువల్లో సన్యాసుల్లో కలవడం తను వినే ఉన్నాడు. పత్రికల్లో ఇలాంటి వార్తలు పడితే, పనిగట్టుకొని వచ్చి తనతో చెప్పి, పెద్దగా నవ్వి, ఊళ్లో ఉండే గోడ పత్రిక వద్దకు వెళ్ళేవాడు రాయి. ప్రతి దినము దినపత్రికల్లో వచ్చే వార్తలకు తన స్వంత రాజా హాస్యాన్ని తగు పాళ్లలో రంగరించి నల్ల సిమెంటు గోడ మీది కెక్కించే పనిని పైనందిన కార్యక్రమంగా పెట్టుకొన్న పెద్దమనిషి దగ్గరకు వెళ్లి, "ఈ వార్త చూశారా — అప్పులపేటలో నా మిత్రుడు గంగాధరం లేడూ? వాడు కుటుంబరావు కూతుర్ని ప్రేమిస్తున్నాడు. కాబోయే మామగారు మావాడి పాలిట విలన్‌లా దాపురించి, కూతురిని వా డెవడో సుధాకరముటు—నల్లగా, అసహ్యంగా, అడవి పిల్లిలా ఉంటాడుట—వాడి కిచ్చి పెళ్లి నిశ్చయించి, నా ప్రియ మిత్రుడికే [illegible] ఒక ఆహ్వాన పత్రికను పంపాడండి. దానికి తట్టుకోలేక మా వాడు—'నేను పెళ్లి చేసుకుంటే కుటుంబరావు కూతుర్నే చేసుకుంటాను. అది అసంభవమని తేలింది కనక సన్యాసుల్లో కలిసిపోతున్నాను' అని కాగితం వ్రాసిపెట్టి, రాత్రి రైల్లో పారిపోయాడు. ఎంత ఘోరం జరిగిందో చూశారా" అని ప్రశ్నించాడు. "ఆ [illegible] లేమైనా పడిపోయిందా?" అని

తీసుకొని స్వాములవారి వద్దకు వచ్చి కంట తడి పెట్టడం మొదలుపెట్టింది. భుజంగం, శాయి ఆమెను ఎంత ఓదార్చినా ఆమె దుఃఖం ఆగలేదు. చుట్టూ ఉన్న పెద్ద మనుషుల్లో ఒకాయన— "ఏం పాపం చేశావో ఏమిటో, ఈ కష్టం నీకొచ్చింది. అందుకు ఇక్కడ గొడవచేస్తే ఏం లాభం" అన్నాడు నిర్దాక్షిణ్యంగా. ఒక వ్యక్తి— "ఒరే, దీని సంగతి నీకేం తెలుసురా? ఇది ఇస్మాయిల్ లేవదీసుకొచ్చిన మనిషిరా" అన్నాడు వెనకా ముందూ చూడకుండా.

"ఆఁ ఇస్మాయిల్ భార్యా!" అని భుజంగం సందేహం వెలిబుచ్చాడు.

"భార్యా చట్టుబండలా, రెండు మూడేళ్ల నాడు దీన్ని లేవదీసుకొచ్చి, ఈ ఊళ్లో సంసారం పెట్టాడండీ. మొదట భార్యాభర్తలమని, ఇదేమిటి మీ మతాలు, కులాలు వేరుగదా— మీ పెద్దవాళ్లు ఎలా ఒప్పుకున్నారు అని నిలదీసి అడిగితే, ప్రేమకు ఇవన్నీ అడ్డమొస్తాయా అని పెద్ద పెద్ద మాటలతో మా నోళ్లు మూశారు. కాని,తరవాత తరవాత అసలు గుట్టు బయట పడింది. పచ్చటి సంసారం పాడుచేసుకొని లేచి వచ్చేసింది. భర్త ఏదో కాలేజీలో పని చేస్తున్నాడట. అతణ్ని మోసం చేసింది. నేను ఇస్మాయిల్‌తో— 'వాళ్ల సంసారంలో చిచ్చు పెడితే నీకేమి వస్తుంది? ఎవర్నైనా మీ వాళ్ల పిల్లను నిక్కా చేసుకొని సుఖపడగూడదా' అన్నాను. అంతే. వాడు— "మీరంతా సక్రమంగా సంసారాలు చేస్తున్నారా? తెలియకుండా ఉన్నంత వరకు అందరూ పెద్ద మనుషులే. తెలిస్తే మీ జీవితాలు రామాయణ మంత ఉంటాయి. మనస్సు ఒక చోట, మనిషి ఇంకొక చోట ఉండే కన్నా మనస్సు ఉండేచోటికే వచ్చేసింది శ్యామల. అది నాలో లేచి వచ్చినప్పుడు, దానికి నాలుగు నెలల గర్భం ... ఆ మొగుడు ఎంత అమాయకుడో గాని, అప్పటిదాకా కూడా పెళ్లానికి గర్భమని తెలియదట. ఇది చెప్పి శ్యామల పగలబడి నవ్వింది ... మా సంగతి నీకెందుకయ్యా పో' అని నన్ను హడలగొట్టాడు" అని ముగించాడు ఆ వ్యక్తి.

"అదా సంగతి! అయితే ఈ కథ మన పత్రికల్లో ఎందుకు పడలేదబ్బా ... పడే ఉంటుంది. పడే ఉంటుంది. నేను చూసి ఉండను. ఎంత న్యూస్ వాల్యూ, ఎంత న్యూస్ వాల్యూ!" అని బిగ్గరగా ఆలోచించసాగాడు శాయి.

"న్యూస్ వాల్యూయో, న్యూసెన్సు వాల్యూయో, నాకు తెలియదుగాని, నీవు మాత్రం ఊరుకో" అన్నాడు శాయితో, భుజంగం.

"ఈ నీచురాలిమీద దయ పనికిరాదు. అది కన్న బిడ్డ మీద కూడా కనికరం వద్దు. ఛస్తే చావనీ. ఇక్కడి నుంచి తక్షణం వెళ్లగొట్టండి. ఈ నిర్మలమైన వాతావరణం కలుషితం కాకూడదు" అని ఒక భక్తుడు ఆదేశించాడు. భుజంగానికి, తదితర భక్తులకు ఇది మంచి పరిష్కారం అని తోచింది. వారందరు ఒక్కసారిగా శ్యామలను "తక్షణం ఇక్కడి నుంచి వెళ్లిపో" అని ఆజ్ఞాపించారు. శ్యామలకు మొదటి సారిగా భయం కలిగింది. ఆవిడ కదలకుండా ఉండడం చూసి "నీ అంతట నీవు వెళ్లకపోతే, మేమే నిన్ను గెంటేయవలసి వస్తుంది" అని హుంకరించారు. శ్యామల కళ్లలో నీళ్లు తిరిగాయి. రింగులు తిరిగిన జుట్టు విడివిడిగా చీలి ముఖం మీదకు జారి ద్రవించిన దుఃఖాన్ని దాచటానికి ప్రయత్నిస్తోంది. శ్యామల వెంట్రుకలను పైకి తోసుకొని ఎడంచేత్తో పిల్లాణ్ణి గట్టిగా పట్టుకొని కుడిచేత్తో చీర కొసను జాగ్రత్తగా లాక్కుని వెనక్కు తిరిగి వెళ్లిపోవటానికి బయలుదేరుతుంటే ఒక అందమైన ముఖం స్వాములవారికి కనుపించింది. తెల్లటి కోలమొహం, సూటిగా ఉన్న నాసిక, నిర్మలమైన చల్లటి వాతావరణంలో మెరుస్తున్న మెరుపులోని కాంతిని దోచుకున్న నయనాలు, ఆవేదనతో ఎరుపెక్కిన పెదిమలు, అవి విడిపోయినప్పుడు కనుపించే తెల్లటి పలువరుస, ముద్దుగా, నాజూకుగా పెరిగిన అవయవ సౌష్ఠవంతో శ్యామల అందంగాను, ఆరోగ్యంగాను కనుపించింది.

స్వామీజీ కొంచెం చలించారు. శ్యామల అందాన్ని చూసి తను ఏదో పోగొట్టుకున్నవాడిలా బాధపడ్డారు. శ్యామల ద్వారం వైపు నడుస్తూ వెనక్కు తిరిగి చూసింది. స్వాములవారు, "శ్యామలా!" అని పెద్ద కేక పెట్టారు. సభ్యులంతా ఒక్క సారి స్వామీజీ ముఖం చూశారు. వారికి ఆశ్చర్యం కలిగింది.

శ్యామల తిరిగి వచ్చి నిలుచుంది, నేరస్థుడు న్యాయాధిపతి ముందు నిలుచున్నట్లు. "అమ్మా, ఏమిటి సంగతి?" స్వామీజీ ప్రశ్న.

"మా పాపాయికి పది రోజుల నుంచి జ్వరం వస్తున్నది. ఎన్ని మందు లిచ్చినా తగ్గలేదు. దినదినానికి శుష్కించి పోతున్నాడు. బతుకుతాడనే ఆశ కూడా పోయింది. మీ రేదైనా మంత్రించిన కుంకుమ గాని, విభూతి గాని ఇస్తే దానిని పెట్టి, ఆ శక్తితో నైనా నా పాప బ్రతుకుతాడేమో ననే ఆశతో మీ దగ్గరకు వచ్చాను. నా బిడ్డ తిరిగి ఆరోగ్య



వెలుతురు — ఫోటో— బి. పి. రెడ్డి ( గోవా )

వంతుడైతే మీ ఫోటో మా ఇంట్లో పెట్టుకొని ప్రతి రోజు నా దేవుడిలాగా పూజిస్తాను" అని మనవి చేసుకుంది శ్యామల.

"అలాగా ... ఫరవాలేదు ... దగ్గిరకి రా ..." అని పాపాయిని చేతిలోకి తీసుకొని, శ్యామల బుగ్గలను తాకి, ఆమె వీపు నిమిరారు. చూస్తున్న భక్తులలో కొంచెం కలకలం రేగింది.

"ఏమిటి, ఈ స్వామీజీ చేస్తున్నది? ఆ కులటను దగ్గిరకి తీయటమే కాకుండా వీపు నిమురుతారా! స్వామీజీ అయికూడా ఇంకా ఆడదాని మీద వ్యామోహం దేనికి? ఆవిడ తేలిగ్గా లొంగుతుందనే కదూ ఈయన ఉద్దేశం? ఆడదాని జాడ అర్థంబు జూడగ, బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు అని వేమన చెప్పింది సార్థకం చేస్తున్నాడే ..." అని గుసగుసలు బయలుదేరాయి. "నిశ్శబ్దం" అన్నారు స్వామీజీ. అంతా గప్‌చిప్‌గా ఊరుకున్నారు. బిడ్డను తల్లికి ఇచ్చి లోపలికి వెళ్లారు. నిమిషంలో తిరిగివచ్చి ఆసనం మీద కూర్చున్నారు. వ్యాధి లక్షణాలన్నీ అడిగి, కాగితం మీద వ్రాసుకున్నారు. చేతిలోని కుంకుమ పొట్లం ఆమె చేతికి అందించి, "అమ్మా, దీన్ని మొహాన పెట్టి, పిల్లవాడు ఏడ్చినప్పుడు ఒక చిటిక నీళ్లలో వేసి తాగించండి. నేను రాత్రికి హైదరాబాదులో నా క్లాస్ మేట్ డాక్టర్ ఇంద్రాణితో ట్రంక్ కాల్‌లో మాట్లాడి మంచి మందును అడిగి తెలుసుకుంటాను. ప్రొద్దుటనే మీరు వచ్చినా, లేక ఎవర్నైనా పంపినా, ఆ మందు పేరు వ్రాసిన చీటీని మీకు అందజేస్తాను. సెలవు" అన్నారు. శ్యామల స్వామీజీ పాదాలకు నమస్కరించి, కన్నీళ్లు తుడుచుకొని వెళ్లిపోయింది. భుజంగం, శాయి, మిగతా వాళ్లు ఆయన దగ్గర సెలవు తీసుకొని ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

మర్నాడు ప్రొద్దున్నే శ్యామల శిశువు మందు సంగతి ఏమవుతుందోనని

భుజంగం, శాయి స్వామీజీ మకాం చేసిన పెంకుటింటి గదికి వెళ్ళారు. గొళ్ళెం తీసి లోపలికి వెళ్ళారు. అక్కడ ఎవ్వరూ ఉన్న అలికిడి లేదు. స్వామీజీ తెచ్చుకున్న సంచీ అక్కడ లేదు. దాని స్థానంలో ఒక చిన్న చీటీ మాత్రం పడి ఉంది. భుజంగం తీసుకున్నాడు. ఆశ్చర్యం, అలజడి అతన్ని కదలించి వేశాయి. ఇంతలోపల శ్యామల వచ్చింది. "స్వామి వెళ్ళిపోయారా? మరి రాత్రి ఇన్ని కబుర్లు చెప్పారే" అంది. "మనల్ని తప్పుదారి పట్టించడానికి. కనీసం వెళ్ళే ముందు మనకు చెప్పి వెళ్ళకూడదా?" అన్నాడు శాయి. "ఈ చీటీ మీద స్పష్టంగా మందుపేరే వ్రాసి ఉంది. ప్రతి దినము మూడు డోసులు, నాలుగు గంటల కొకసారి అని వ్రాసి ఉంది. ఇది నువ్వు తీసుకో, అమ్మా" అని ఆ చీటీని శ్యామల కిచ్చాడు భుజంగం.

తరవాత రెండు రోజులకు భుజంగం అడ్రెసుకు ఒక కవరు చేరింది. అందులో ఒక కాగితం మీద చక్కటి దస్తూరితో ఇలా వ్రాయబడి ఉంది:

"మిత్రులారా,

దీనిలో నేను వ్రాస్తున్న విషయాలు మీకు కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. అసలు ఈ విషయాలు వ్రాయడం దేనికి అని కూడా మీరు అనుకోవచ్చు. మీకెవ్వరికీ తెలుపకుండా మీ గ్రామాన్ని వదిలి వెళ్ళడం మీకు బాధ కలిగించి ఉండవచ్చు. అందుకు గల కారణాలు తెలిస్తే మీరు నన్ను క్షమిస్తారని నమ్ముతున్నాను.

శ్యామల ఎవరో కాదు, నా భార్య. నేను దురదృష్టవంతుణ్ణి. చిన్నప్పటి నుంచి నన్ను ఏదో ఒక కష్టం వెన్నాడుతూంది. కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్నాను. పెళ్ళి చేసుకొని సుఖపడదామనుకుంటే, భార్య లేచిపోయింది. లేచిపోయేటప్పటికి ఆమె గర్భవతి కూడా. ఈ విషయం హైదరాబాదులో డాక్టరుగా ఉన్న నా క్లాస్‌మేట్ ఇంద్రాణి చెప్పింది. ఒకసారి శ్యామల స్పృహ లేకుండా పడి ఉంటే ఇంద్రాణి వచ్చి ఇంజెక్షన్ ఇచ్చి, మందులు వ్రాసి ఇచ్చి, ఒక అర గంటలో స్పృహ వస్తుందని చెప్పి వెళ్ళిపోయింది. తరవాత ఒకసారి ఆవిడ నాకు కనపడి, 'మీ ఆవిడ నా హాస్పిటల్‌కు వచ్చి పరీక్ష చేయించుకుంది మొన్న. ఆమెకు మూడు నెలల గర్భం. ఎవరో కొత్త వ్యక్తితో వచ్చింది. అతనెవరని అడిగితే తన భర్త అని చెప్పింది. ఒకసారి ఆమె స్పృహలో లేనప్పుడు చూశాను గనక పోల్చుకోగలిగాను ఆమెను. ఆవిడకు మీరు విడాకు లిచ్చారా?' అని అడిగింది. నాకు ఏమి చెప్పడానికి తోచలేదు. 'అలాగా? అయితే ఈ విషయాన్ని తరవాత చర్చిద్దాము' అని సెలవు తీసుకొని వచ్చేశాను. నేను శ్యామలతో డాక్టర్ ఇంద్రాణి చెప్పిన విషయాన్ని గురించి ప్రస్తావించలేదు. ఎందుచేతనంటే, అప్పటికే నన్ను లెక్కచేసే స్థితిలో లేదు శ్యామల. తరవాత కొన్నాళ్లకే లేచిపోయింది. నాకు సంసారం మీద విరక్తి పుట్టి, సంఘంలో తలెత్తుకోలేక, సన్యాసం తీసుకున్నాను. శ్యామల తన బిడ్డకు బాగా లేదంటూ నేను తన భర్తనని తెలియక నా దగ్గిరకే వచ్చి, బిడ్డ ప్రాణాలు కాపాడమని కోరడం నాకు ఆగ్రహానికి బదులు ఆశ్చర్యం కలిగించింది. ఎందుచేతనంటే, ఆ శిశువు అంతా నామాదిరిగా ఉన్నాడు. అన్ని విధాలా వాడు నా బిడ్డే. ఆ శిశువును కాపాడ్డానికి నా చేతనయినదంతా చేశాను. నా జీవితమంతా అపశ్రుతులతో గడిచింది. ఇన్ని అపశ్రుతుల మధ్య ఒక్కసారి, కనీసం ఒక్కసారైనా మధుర గానం వినిపిస్తే ఆనందిస్తాను. నేను అంతకన్నా ఏం కోరగలను? కాని ఇక్కడ వ్రాసిన విషయాలను ఎవ్వరికీ తెలుపవద్దని కోరుతున్నాను. గప్‌చిప్.

ఇట్లు,

సెలవు తీసుకొను, విధేయుడు,

—స్వామీజీ."

వారం రోజులకే శ్యామల కొడుకు ఆరోగ్యం బాగయింది. ఆ వార్త తెలియగానే భుజంగం తిరిగి స్వాములవారి ఉత్తరాన్ని మరొకసారి చదువుకొని, తిరిగి మడిచి కవర్లో పెట్టి, దానిపైన "గప్‌చిప్" అని వ్రాసి బీరువా డ్రాయర్లో అన్ని కాగితాల అడుగున జాగ్రతగా భద్రపరిచాడు. ★

